


—ఇందూరు భారతి

గౌరవ శేషుకు నమస్కారాలతో,

మనం కాలేజీవదిలి ఆరేళ్ళు కావ స్తోంది. ఎన్నో వుత్తరాలు రాశాను. ఒక్క ఉత్తరానికైనా ప్రత్యుత్త రం లేదు. నువ్వెందుకు వుత్తరాలు రాయడంలేదో నాకు బాగా తెలుసు. పెద్ద వ్యాపారం గదా మరి। షుగర్ ఫ్యాక్టరీ ఎలా నడుస్తోంది. అసలు నీ కంటిమీద రెప్పయినా వాలు తుందో- లేదో।

అయినా నేను నీకు తెలిపేది చాలావుంది శేషూ।

ఇప్పుడు నా భార్య గర్భ వతి, నేను చేస్తున్న వుద్యోగం చాలా చిన్నది. వచ్చిన నెల జీతం కాస్తా బాకీలకే సరిపోవడం లేదు. ఇప్పుడు నేనేంచేయాలో అర్థం కావడంలేదు. చాలా ఇబ్బం దుల్లో వున్నాను. ఓ వందరూపా యలు పంపి ఈ పరిస్థితుల్లో నన్ను కాపాడగలవని మనసారా వేడు కొనే.... నీ సహాయం కోరే,

—చంద్ర"

"శ్రీయుత వాసుగారికి పుష్పాం జలులతో—

అంతా కులాసేనని తలుస్తాను: మూడేళ్ళ క్రితం అడపాదడపా వుత్తరాలు వ్రాస్తుండే వాడివి. ఇప్పుడు ఆ వ్రాయడం కూడా మానేశావ్, అయినా ఫర్వాలేదు.

నిండు గుండెతో విప్పి చెబుతున్న వా మనవిని ఆలకిస్తారని....

నా సతీమణి గర్భవతి. హాస్పిటల్‌లో చేర్చడానికి చిల్లి గవ్వకూడా లేదు. ఎందర్ని అప్పడిగినా, 'తెలియడం లేదా! ఈ కరువు కాటకాల ఇబ్బందులు. మేమెక్కడి కెళ్ళి తెచ్చేది!' అనేవారే దర్శనమిస్తున్నారు. ఈ సమయంలో నేనేం చేయాలో భయరేగా వుంది. మీరు ఈ పరిస్థితులనుండి గట్టెక్కిస్తారనే నమ్మకముంది. మొట్ట మొదటి సారిగా మీకిలా వుత్తరం రాయడం జరుగుతోంది. దయతో ఓ వందా యాభై రూపాయలు పంపి నా ఈ సమస్యను పరిష్కరించ గలందులకు ప్రార్థిస్తూ....

మీ యందు దృఢనమ్మకమున్న

—చంద్ర"

"డియర్ బోసుకు పదివేల నమస్కృతులతో....

ఎప్పుడో ఒకప్పుడు నువ్వేసిన వుత్తరంలో మీ సిగరెట్ కంపెని ఇన్‌స్పెక్షన్‌కి రమ్మనట్టు పదే పదే రాశావు.

మధ్యతరగతి మనిషి అడుగడుగునా ఎన్ని చిక్కు సమస్యల నెదుర్కోవాల్సుంటుందో నీకు చెప్పినా అర్థంకాదు బోసూ!

నేనిప్పుడు సుడిగాలిలో చిక్కుకున్నాను. క్షణం ఆలోచిస్తే నేనేమైపోతానో నన్న భయం తప్ప మరేమీ కనబడటంలేదు. చూడు బోసూ! నా భార్య గర్భవతి. చాలా అవస్థలోవున్నాం.డబ్బు అవసరమై నీ కీ విషయం తెలుపుతున్నాను. రెండొందలు మనియార్డరు చేసి, నువ్వీ సమస్యకు పరిష్కారుడివవుతావని నిండునమ్మకంతో నీకీ వుత్తరం వ్రాస్తున్నాను.

ఆర్థిక సహాయంకోరే-

ఆత్మాభిమానం గల,

—నీ చంద్ర"

"ప్రియమైన విష్ణుకు పదేపదే నమస్కారాలతో—

మనమోసారి కాలేజీలో నాటకం ఎంతో బాగావేశాం. గుర్తుందా! అందులో నీది కోటీశ్వరుని పాత్ర. నాది మధ్యతరగతి పాత్ర. మనిద్దరం ఒకే క్లాస్ మేట్స్‌లా, చిలిపి చేష్టలూ, తర్వాత పెళ్ళిళ్ళు, ఆ తర్వాత నువ్వు వ్యాపారంలోకి దిగి వేరే పట్టణంలో కాలక్షేపం చేస్తున్నట్టు, నే నదేవూళ్లో వుండి ఏదో ఉద్యోగం చేస్తూ కాలాన్ని నెట్టేస్తున్నట్టు, నాభార్య సీరియస్‌గా వుందంటే, ప్రాణస్నేహితుడవని నీ దగ్గరికివచ్చి ప్రాధేయ పడ్డట్టు, నువ్వెంతో డబ్బుయిచ్చి సహాయం చేసి సమస్యను పరిష్కారం చేసి

నట్టు, సుడిగుండంలో చిక్కుకున్న నా కుటుంబాన్ని రక్షించినట్టు- ఆనాటి నాటకంలో ఈఘట్టం ఎంత బాగా నటించామో గుర్తుందను కుంటాను.

ఇంతకూ నిన్నర్థించేది ఆ నాటకంలో లాంటిదే! అయినా ఇటువంటి పరిస్థితి రాదనుకున్నాను; రావద్దనుకున్నాను.

గర్భవతైన నా భార్యను హాస్పిటల్‌కు తీసుకెళ్ళటానికి - అడ్డమైన ఈ సమస్యల్ని ఎదుర్కోవాల్సొస్తోంది. నా బ్రతుకిప్పుడు సముద్రపు టలల్లో చిక్కుకున్న పడవలా వుంది. ఈ బాధనుండి తప్పించే బాధ్యత నీ మీదుంచుతున్నాను.

నువ్వీ సమస్యను పరిష్కారం చేసే సమర్థుడివనే నమ్మకంతో.... నువ్వు నా ప్రాణస్నేహితుడి వన్న చనువుతో నీ కీ బరువును వేస్తున్నాను. మరో విధంగా భావించకూడదని మరోసారి తెలుపుతున్నాను. అవలీలగా ఈ బరువును మోసి రెండొందలు ఈ వుత్తరాన్ని అందుకున్న వెంటనే....

వాడిపోయిన మోడులా మారిన

నీ ప్రాణమిత్రుడు,

చంద్ర."

"ప్రియాతి ప్రియమైన సత్యంకు వ్రాయునది—

సత్యం! అసలేమని వ్రాయాలీ వుత్తరం. అర్థం కావడం లేదు. నా కెన్ని బాధ్యతలూ, బరువులూ వున్నాయో, ఎన్ని సమస్యలూ, ఎన్ని చిక్కులూ తలెత్తుతున్నాయో నీకు కూడా అన్నీ వున్నాయని తెలుసు.

అయినా నీకీ విషయం చెప్పక వుండలేక పోతున్నాను. నువ్వు త్యాగశీలివన్న సంగతి మరువలేను కాబట్టి.

నా భార్య గర్భవతి అయింది. హాస్పిటల్‌కి తీసికెళ్లాలంటే చేతిలో నయాపైసా లేదు. పరిస్థితులు విషమించి పోతున్నాయి.

అటు, నిటు భయంకర లోయల మధ్యవున్న వారధిపై నిల్చున్నాను. యెలాంటి పెనుతుఫా నొస్తుందో తెలియడంలేదు.

నీ కివన్నీ రాస్తోంది. — నీ నుండి సహాయం పొందాలనే దురుద్దేశంతో కాదు. నేనంతటి తెలియని మూర్ఖుణ్ణి కాదు. నువ్వు కూడా నాలాంటివాడివే గనుక.

అందుకని ఈ రోజే మన నలుగురు క్లాస్‌మెట్సు శేషు, వాసు, బోసు, విష్ణులకు అతి దీనంగా వేడుకుంటూ వుత్తరాలు రాశాను. వాళ్లు కోటీశ్వరులు. వాళ్ళలో యే ఒక్కరైనా సహాయం చేయగల

రన్న నమ్మకం నాలో నాటుకుని వుంది. యింతకంటే ఎక్కువేమీ చెప్పలేను — ఇంతే సంగతులు. జీవితం అనే మహా సముద్రంలో ఒడ్డు కొరకు ఈదుతోన్న నీలాంటి

చంద్ర."

ఐదుగురికి ఉత్తరాలురాసి టపాలో పడేసేసరికి రాత్రి పదయింది. పడుకున్నాడు. పడుకున్నాడేగాని అతని మనసంతా సంచలనం, ఆలోచనలు ఆకాశంలో తెగిన గాలిపటాల్లా విహరిస్తోన్నాయి. తెల్లారితే ఇంకెటువంటి సమస్యల నెదుర్కోవాల్సొస్తుందోనన్న భయం తప్ప, అతని నిద్రలో ఇంకేమీ మిగల్లేదు.

రోజూ దేవుడిమీద పువ్వేయడం మరుస్తున్నాడేమో గాని, పోస్టుమాన్‌ని కలవడం మాత్రం మరువడంలేదు.

వారం రోజుల తర్వాత వచ్చిన వుత్తరాన్ని, మనియార్డరును అందుకొంటున్న చంద్రం ముఖం ముద్దబంతి పువ్వులా, పున్నమినాటి చంద్రుడిలా వెలిగిపోయింది.

కట్టను తెంచుకొస్తోన్న నీటి వేగంలా సంతోషాన్ని వ్యక్తపరుస్తున్నాడు-వుత్తరాన్ని చించేప్పుడు.

"—శ్రీచంద్రగార్కి—

వారం రోజుల క్రితం వ్రాసిన నీ ఉత్తరాన్ని అందుకున్నాను. కాలేజీలో చదివేప్పుడు నాకంటే ఎక్కువగా నిన్ను తమప్రాణాల్లో కాపాడుకున్న కోటేశ్వరుల కొడుకులు శేషు, వాసు, బోసు, విష్ణు నీకు సహాయపడతారన్న విషయం కల్ల. నేనే నీకు సహాయం చేస్తున్నానని గర్వం కాదు.

ఈ వ్యవస్థవుంది చూడూ, వున్నవాడు వున్నవాడికే సహాయపడతాడు, లేనివాడికి సహాయపడడనే విషయం నాకెంతో గుణపాఠం నేర్పింది. ఆ అనుభవం వుందనే నీ కీ విషయం తెలుపుతున్నాను. ఈ వ్యవస్థ మారితేనేగాని నాలాంటి, నీలాంటి వారు బాగుపడరనే చెప్పాలి.

చంద్రా! నీ బాధలను అర్థంచేసుకున్నాను. ఈ వందరూపాయలను ఎక్కడో - ఎవ్వడో అప్పిచ్చాడని కాదు. నా పరిస్థితులు కూడా అటువంటివే కాబట్టి. నా పెళ్ళాం మంగళసూత్రాన్నమ్మి పంపేటప్పటికి చాలా ఆలస్యమయింది. ఈపొరపాటుకూ, యింతకంటే ఎక్కువ పంపలేనందుకు నేనూ నీలా అసమర్థుడ్ని గనుక నన్ను క్షమిస్తావని ఆశిస్తూ, ఇప్పుడూ, ఎప్పుడూ ఇంకెప్పుడూ

—నీ మిత్రుడే!—సత్యం"

(అముద్రిత "నా తరంలో" అనే కథా సంకలనం నుండి) •